




దూసుకొస్తున్న దిత్వా

- తుపాను ప్రభావంతో నేడు, రేపు జిల్లాలో భారీ వర్షాలు
- ఇస్రో ఉపగ్రహాల ద్వారా సమాచారం
- అప్రమత్తమైన అధికారులు

సూళ్లూరుపేట/కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను తీరం వైపు దూసుకొస్తోందని, ఆదివారం తెల్లవారుజాము నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి బంగాళాఖాతం, శ్రీలంకను ఆనుకుని కొనసాగుతున్న తుపాను ప్రస్తుతం పుదుచ్చేరికి 300 కి.మీ, చెన్నైకి 400 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 4 గంటలుగా 6 కి.మీ వేగంతో కదులుతోంది. తుపాను ప్రభావంతో జిల్లాలో శనివారం ఉదయం నుంచి చలిగాలులతో కూడిన జల్లులు కురిశాయి. పెళ్లకూరులో 32.2మి.మీ, తొట్టంబేడులో 30, డీవీసత్రంలో 26.6, సూళ్లూరుపేటలో 17 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం తెల్లవారుజామున తీవ్ర వాయుగుండంగా మారి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశముంది. దీని ప్రభావంతో చిత్తూరు, తిరుపతి జిలాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. నదులు, వాగులు, వంకలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం వరకు మత్స్యకారులు పులికాట్ సరస్సు, సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య, కడప జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశముంది. ఇస్రో సహకారంతో తుఫాన్ ప్రభావం, దాని కదలికలు, సంబంధిత ప్రాంతాల్లో వాతావరణం గురించిన సమాచారాన్ని అధికారులు తెలుసుకుంటూ ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సెలవుల్లో ఉన్న వారు రద్దు చేసుకుని విధులకు హాజరుకావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా మండల, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని కోరారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. భారీ వర్షాలు కురిస్తే సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ రద్దు చేయడమేగాక విద్యా సంస్థలకు సెలవు ఇవ్వనున్నట్లు తెలిసింది.

అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రకటన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతిలో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువులు, కాలువలు, వాగులు, వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సెలవులు రద్దు చేయాలన్నారు.

తూపిలిపాళెం బీచ్‌లోకి అనుమతి లేదు

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తూపిలిపాళెం సముద్రతీరంలో పర్యాటకులకు అనుమతి లేదని మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని బీచ్‌లలో పర్యాటకులను అనుమతించడంలేదన్నారు.

ఆరుగురిపై పీడీ యాక్టు

- గంజాయి, డ్రగ్స్ సరఫరా, విక్రయాల కేసుల్లో..
- త్వరలో మరింత మందిపై ఉంటాయన్న ఎస్పీ



కరణి సాయికుమార్, వంశీ, వేణుగోపాల్, పరందాము, హరి, మురళి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, వినియోగం, రవాణా చేస్తున్న ఆరుగురిపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు శనివారం తన కార్యాలయంలో ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అదే సమయంలో డ్రగ్స్, గంజాయి కట్టడికి ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఏడుగురిపై పీడీ యాక్టు నమోదు చేశామని తెలిపారు. ప్రస్తుతం మరో ఆరుగురిపై నమోదు చేశామని వివరించారు. ఇందులో శ్రీకాళహస్తి శ్రీరామనగర్ కాలనీకి చెందిన కరణి సాయికుమార్, బృందమ్మ కాలనీకి చెందిన చెరుకుర్తి వంశీ, వీఎం పల్లెకు చెందిన వేణుగోపాల్, పరందాము, తిరుపతి పద్మావతీపురానికి చెందిన సాదు హరి, తడ గ్రామానికి చెందిన నల్లా మురళి ఉన్నారని తెలిపారు. వీరిపై మాదక ద్రవ్యాలు, గంజాయి, బాంబు ఎక్స్‌ప్లోజివ్స్ ఎర్రచందనం అక్రమ రవాణా, దొమ్మీ, హత్య కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు కేవెన్ మూర్తి, చెంచుబాబు, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, తడ సీఐలు పాల్గొన్నారు.

అయిననూ పోవలె శ్రీకృష్ణ జన్మస్థానమునకు



"శ్రీవారి సన్నిధిన ఘోర పాపాలు చేసితివి.. కావున పోవలె.. శ్రీకృష్ణ జన్మస్థానమునకు ... నువ్వు లెక్క పెట్టాల్సింది నైలు నదిలోని మొసళ్లు కాదు భూమనా.. జైలులోని దోమలూ, బల్లులు. నీవంటి పాపాత్ములను దేవుడు క్షమించడు."

- తిరుపతిలో మీడియాతో టీటీడీ జాతీయ అధికార ప్రతినిధి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామిరెడ్డి



నిండా ముంచేశారు

- నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతుల గోడు
- అనేక మండలాల నుంచి వస్తున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయాధికారులు



మన్నెముత్తేరిలో 20 రోజులకే వెన్ను దశకు చేరిన వరిపంట (ఇన్‌సెట్‌లో) సూళ్లూరుపేట వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద వెన్ను తీసిన వరిపైరును చూపిస్తున్న వరదయ్యపాలెం మండలం కళత్తూరు గ్రామ రైతులు

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో నకిలీ వరి విత్తనాలతో రైతులు మోసపోయారంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త సంచలనంగా మారింది. సూళ్లూరుపేటలోనే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. శనివారం సూళ్లూరుపేటలో ఉన్న ఓ ప్రైవేట్ దుకాణం వద్దకు, వ్యవసాయశాఖ కార్యాలయానికి వెన్ను తీసిన వరిపైరును చేతపట్టుకుని 'నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మునిగిపోయాం, న్యాయం చేయండి' అంటూ పలువురు రైతులు వచ్చారు. సూళ్లూరుపేట మండలం నుంచేగాక తడ, దొరవారిసత్రం, వరదయ్యపాలెం, బీఎన్‌కండ్రిగ మండలాల నుంచి ఈ రైతులు వచ్చారు. దుకాణ యజమాని 'మాదేమి లేదు కంపెనీ వారికి తెలిపాం.. వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రెండు రోజుల తరువాత కొనుగోలు చేసిన బిల్లులు తీసుకుని రండి కంపెనీ వాళ్లు వస్తారు. మాట్లాడతారు' అని సమాధానం చెప్పడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. అక్కడి నుంచి వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎవరు లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

2వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంట

రబీ సీజన్‌లో సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో దాదాపు 13 వేల హెక్టార్ల పైగా సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా బీపీటీ రకాల పంటను సాగు చేస్తారు. సూళ్లూరుపేటలో ఉండే ప్రైవేట్ డీలర్ల నుంచి సెప్టెంబరు, అక్టోబరు నెలలో బీపీటీ 2782 (జిలకర మసూర) రకాల వరి విత్తనాలను కొనుగోలు చేశారు. ఈ సీడ్ గోతాలపై అన్నపూర్ణ సీడ్స్ నంద్యాల అని ఉంది. నంద్యాల నుంచి ఈ విత్తనాలను సరఫరా చేశారని డీలర్లు తెలిపారు. ఈ విత్తనాలను సూళ్లూరుపేట మండలంలోనే కాకుండా తడ మండలం కారిజాత, వేనాడు, వాటంబేడు, గొల్లలమొలువు, దొరవారిసత్రంలో కల్లూరు, శ్రీధనమల్లి, పూలతోట, వరదయ్యపాలెం మండలంలో కళత్తూరు గ్రామ రైతులు దాదాపు 500 మందికి పైగా 1,500 వరి విత్తనాల సంచులను కొనుగోలు చేశారు. దాదాపు 2 వేల ఎకరాల్లో నాటిన పైరు 20 రోజులకే వెన్ను తీసి పంట నాశమైపోయింది. నాటిన 20 రోజులకే వెన్ను రావడమేమిటని రైతులు ఆ నోట ఈ నోట చెప్పుకుని నకిలీ విత్తనాలు వల్లేనని తెలియడంతో నిండా మునిగిపోయామని ఆందోళన చెందారు.

పింఛను సొమ్ము విడుదల

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లకు గాను 2,62,108మంది లబ్ధిదారులకు రూ.112.69 కోట్లు విడుదల చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 691 గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల ఖాతాకు సొమ్ము జమ చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీ చేస్తారు. కాగా, తిరుపతి 49వ డివిజన్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పింఛన్ల పంపిణీలో పాల్గొననున్నారు.

నేడు యూపీఎస్సీ ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫీసర్స్ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్, అకౌంట్ ఆఫీసర్స్ పోస్టులకు కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ జిల్లాలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 వరకు నగరంలోని ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ అధికారులు వర్మ, అర్జునకుమార్ పాల్గొన్నారు.

హైవే కూడళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

- రోడ్ సేఫ్టీ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల కూడళ్లలో, దాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి జైలుశిక్ష పడేటట్లు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చూడాలని,విద్యార్థులకు రోడ్డు భద్రతపై, గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 42 బ్లాక్‌స్పాట్లలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఎన్‌హెచ్‌పీడీలు వెంకటేశ్వర్లు, రవీంద్ర, కొండయ్య చౌదరి, జిల్లా రవాణాశాఖ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం - పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే విజయశ్రీ

దళితుడని చిన్నచూపా..!

ప్రోటోకాల్ పాటించడం లేదు..మీ ఎస్కార్టు నాకు అవసరం లేదు

డీవీఎంసీ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆక్రోశం


తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'నేను దళితుడిని కాబట్టి నన్ను చిన్నచూపు చూస్తున్నారు.. అధికారులు ప్రోటోకాల్ పాటించనప్పుడు నాకు ఈ ఎస్కార్టు ఎందుకు..' అంటూ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆక్రోశం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వేదికగా శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎన్‌కండ్రిగ మండలం కాంపాళెంలో దళిత కుటుంబంపై దాడి చేయడమేగాక వారిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం బాధాకరమన్నారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను సురుటుపల్లి ఆలయ బోర్డులో ఎలా నియమిస్తారని నిలదీశారు. అక్కడ ఒక దళితుడైనా ప్రాతినిధ్యం వహించారా అని ప్రశ్నించారు. సత్యవేడు స్పెషలాఫీసర్‌గా ఉన్న వ్యక్తి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని, పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డికి ఉన్న విలువ తనకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించండి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికపుడు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. డీవీఎంసీలో ప్రస్తావించే ప్రతి అంశానికీ పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, ఇతర అధికారులు విక్రమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



కుప్పం కుర్రోడి జపాన్ జర్నీ



కలంకారీ గురువు

- వివరాలు 8లో -

గుడిమల్లం ఆలయ అన్నదాన సత్రానికి గ్రీన్ సిగ్నల్

ఏర్పేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన సత్రం నిర్మాణానికి నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ అనుమతి మంజూరు చేసింది. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన శివలింగాల్లో ఒకటైన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. సౌకర్యాల విస్తరణలో భాగంగా కల్యాణకట్ట, పాకశాల, అన్నదాన సత్రం, యాగశాల, రాథాశాల వంటి నిర్మాణాలకు అనుమతుల కోసం ఎంపీ గురుమూర్తి పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి, పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు లేఖల ద్వారా వివరించారు. ఆలయ కమిటీ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి పలు పర్యాయాలు లేఖలు రాశారు. నిర్మాణాల్లో కొంత భాగం ఆలయ రక్షిత ప్రాంతంలోకి వస్తుండటంతో అనుమతులు ఆలస్యమైనా ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో భక్తులకు అత్యవసరమైన తాత్కాలిక అన్నదాన సత్రం నిర్మాణానికి నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేసింది. కాగా, ఆలయాభివృద్ధికి దేవదాయ శాఖ ఇప్పటికే రూ.95లక్షలు సీజీఎఫ్ నిధులు కేటాయించింది.



టూరిజం అభివృద్ధికి స్థల పరిశీలన



భాకరాపేట, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): చిన్నగొట్టి గల్లు మండలం టేకల కుంట కుమ్మర పల్లె సమీపంలోని ఆవుల పాసిన గుండ్ల ప్రాంతాన్ని జిల్లా టూరిజం అధికారి జనార్ధన్‌రెడ్డి, ఎస్టేట్ అధికారి రాంప్రసాద్ శనివారం పరిశీలించారు. ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు సరిహద్దు ప్రాంతమైన ఇక్కడ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలు, భూమి అనుకూలత వంటి వాటిని పరిశీలించారు. ఇక్కడ వివిధ రకాల నిర్మాణాలు, పార్కులు వంటివి అభివృద్ధి చేస్తే ఈప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భాగ్యలక్ష్మి, ఆర్ఐ జానకీరామ్, సర్వేయర్ గణేశ్, కార్యదర్శి వెంకటేశులు, వీఆర్వో మస్తాన్ బాబు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



మహిళా ఉపాధ్యాయుల జట్టు

చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు భాస్కర్, లలితకుమారి ఆధ్వర్యంలో పురుషులకు క్రికెట్ పోటీలు, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. మండల జట్లును ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరమణారెడ్డి, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోంచేయండి



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న చిన్నబాబు

రామచంద్రాపురం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు సహ పంక్తి భోజనాలను చేయాలని ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చిన్నబాబు సూచించారు. మండలంలోని కమ్మపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని ఆయన రుచి చూశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి ఉపాధ్యా యులు భోజనం చేస్తే కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నామనే భావన విద్యార్థుల్లో కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమాంబ రరావు, వనమాలి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సభాపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు

రామచంద్రాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఆర్‌పీపురం ఎస్టీకాలనీలనీలో మిషన్ శక్తి- సంబల్ కార్య క్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. అంగన్వాడీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ మనీల మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ అమృత, వీఆర్వో యూన్సీ, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, తల్లులు, బాలబాలికలు పాల్గొన్నారు.

క్రీడా హబ్‌కు కలెక్టర్ కృషి ప్రశంసనీయం

● శాప్ చైర్మన్ రవినాయుడు



తిరుపత(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): తిరుపతిని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. తిరుపతి నగరంలో జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దామినేడు వద్ద 28 ఎకరాలను స్పోర్ట్స్ సిటీ కోసం శుక్రవారం రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రవినాయుడు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, తిరుపతి జిల్లా ప్రాధికార సంస్థ డీఎస్‌డీవో, కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గంగమ్మగుడి చైర్మన్

కలెక్టరేట్‌లో శనివారం తాతయ్యగుంట గంగమ్మ చైర్మన్ మహేష్‌యాదవ్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అర్చకులు కలెక్టర్‌ను ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలు, చిత్రపటానికి అందజేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



వినియోగదారులతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్

తిరుపతి (ఆటో నగర్), నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ వినియోగ దారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సదరన్ డిస్కం సీఎండీ శివ శంకర్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం తెల్లగుండ్లపల్లి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. మాజీ సర్పంచ్ ఏకాంబరం నాయుడు, గ్రామస్తులు సుధాకర్, విజయకుమార్, జ్యోతిలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ లైన్లను మార్చాలని కోరగా వెంటనే పర్కిరించాలని అధికారులను ఆదేశించారు. తమ నియోజకవర్గంలో కృష్ణంపల్లి వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. కాణిపాకంలో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కాణిపాకం సమీపంలో ఈవీ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, సీజీఎం పి.మురళీకుమార్, చిత్తూరు సర్కిల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మోహనమ్మ, మునిచంద్ర ఆయన వెంట ఉన్నారు.

చంద్రగిరి

తహసీల్దార్‌కు సన్మానం

ఎర్రావారిపాళెం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండల తహసీల్దార్ పరమేశ్వర స్వామిని శనివారం ఘనంగా సన్మా నించారు. ఈ నెల 30న ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు ఆయన్ను గజమాలతో సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

యూరియా కోసం రైతుల పాట్లు

ఎర్రావారిపాళెం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రైతులు యూరియా కోసం పాట్లు పడుతున్నారు. ఎరువులు దుకాణాల్లో యూరియా దొరకడం లేదు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా 350 బస్తాల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకొన్న రైతులు సింగిల్ విండో కార్యాలయానికి తరలి వచ్చారు. రైతులు భారీగా తరలి రావడంతో సింగిల్ విండో సిబ్బంది పోలీసుల ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. అయితే కొందరికే పంపిణీ చేశారని రైతులు వాపోయారు.

నేడు శ్రీనివాసమంగాపురంలో ఉచిత వైద్య శిబిరం

చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతరాజి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తిరుపతిలోని నారాయణాద్రి హాస్పిటల్ వైద్య బృందంతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయ నున్నారు. శ్రీనివాసమంగాపురం, పరిసర గ్రామాల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

తిరుపతిరూరల్, నవంబరు29 (ఆంధ్ర జ్యోతి): దిత్వా తుఫాను నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కంట్రోల్ రూమ్‌ని ప్రారంభించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.మోహన్ బాబు వెల్లడించారు. వచ్చేనెల 2వతేదీ వరకు రెవెన్యూ సిబ్బంది షిఫ్టుల వారీగా ఈ కేంద్రంలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. తుఫాను వల్ల ఏ ఇబ్బంది కలిగినా ప్రజలు 93920 54152 నెంబరుకు సమాచారమివ్వాలని ఆయన కోరారు. మండలంలో 15 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

పాకాల: దిత్వ తుపాను నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అవసరమైతే సెల్‌నెం. 9492712100కు ఫోన్ చేయాలని తహసీల్దా సంతోష్ సాయి కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉల్లాసంగా ఉపాధ్యాయుల క్రీడలు



ఎర్రావారిపాళెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంఈవోలు బాల సుబ్రమణ్యం, సతీష్‌బాబు శనివారం ప్రారంభించారు. మహిళా ఉపాధ్యాయులకు, త్రో బాల్, పురుషులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): తిరుపతి మాడ వీధుల్లో శనివారం భజన మండలి కళాకారుల నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రతి వారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సంకీర్తనలో గోవింద నామస్మరణలు మార్మోగాయి. గోవిందరాజస్వామి ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాధ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాజశేఖరరెడ్డి, చెంగారెడ్డి, భాస్కరాచారి, సుబ్రహ్మణ్యం, పద్మావతి, ఉషశ్రీ, సిద్ధమ్మ పాల్గొన్నారు.

ఘనంగా బాబాజీ జయంతి

తిరుపతి(కల్చరల్), నవంబరు 29(ఆంధ్ర జ్యోతి) : తిరుపతిలోని భారతీయ విద్యా భవన్ పాఠశాలలో శనివారం మహావతార్ బాబాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబాజీ చిత్రపటానికి హారతులు సమర్పించారు. డాక్టర్ నడింపల్లి సత్యనారాయణరాజు మాట్లాడుతూ మనస్సును నియంత్రించే శక్తి యోగాకు ఉందన్నారు. అనంతరం క్రియా యోగానికి సంబంధించిన శ్లోకాలను విద్యార్థులకు వినిపించారు. భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపాల్ డి.పద్మజ, వైస్ ప్రిన్సిపాల్, టీచర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి(జీవకోన), నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): వినియోగదారుల రక్షణ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలని ఇన్‌చార్జి జేసీ మౌర్య అన్నారు. శనివారం ఇన్‌చార్జి జేసీమౌర్యను జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ రాజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జేసీకి నీ హక్కులుతెలుసుకో అనే పుస్తకాన్ని అందజేశారు.

పేట చెరువు కట్టకు రంధ్రం

భాకరాపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చట్టివారిపాళెం పంచాయతీ నెమలిగుండ్ల సమీపంలోని జాంద్రపేట చెరువు కట్టకు లీకేజీ ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు పైన ఉన్న చెరువులన్నీ నిండి మొరవలు రావడంతో పేట చెరువుకు జలకళ వచ్చింది. దీంతో చెరువు కట్టకు లీకేజీ రావడం చూసిన స్థానికులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఇరిగేషన్ ఏఈ గిరీశ్ కుమార్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి సహకారంతో చెరువు కట్ట దెబ్బతినకుండా లీకేజీలు అరికట్టడానికి చర్యలు చేపట్టారు. బయట ప్రాంతం నుంచి మట్టిని తీసుకువచ్చి లీకేజీ ప్రాంతంలో వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, కార్యదర్శి గిరిబాబు, టీడీపీ నాయకుడు ఆర్వీ రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.





కట్టకు పడిన రంధ్రం - లీకేజీ అరికట్టడానికి మట్టి వేస్తున్న అధికారులు

రైతుల సంక్షేమమే కూటమి లక్ష్యం: ఎమ్మెల్యే నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. రామిరెడ్డిపల్లె పంచాయతీలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన మాట్లాడుతూ సీఎం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రగిరి మండలంలో హంద్రీ -నీవా కాలువ ద్వారా చెరువులను అనుసంధానం చేసి రైతులకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా చంద్రగిరి మండలంలో 4505 మంది రైతులు రూ.2.46 కోట్లు లబ్ధిపొందినట్లు తెలిపారు. రామిరెడ్డిపల్లె పంచాయతీలో ఐటీ కంపెనీలు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్ రిపేర్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణం ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో డిసెంబరు 8వ తేదీ నుంచి 31 రోజుల పాటు పురుషులకు ఉచితంగా రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్ రిపేర్, సర్వీసింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుండి 50 సంవత్సరాల మధ్య కలిగిన నిరుద్యోగ పురుషులకు ఈశిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు సంస్థ ఫోన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న ఉభయదేవేరులు

చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం లో శనివారం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లను కల్యాణ మండపం లో వేంచేపు చేసి ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. వారోత్సావాల సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిం చారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్ కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజి రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్ధసారథి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



కబడ్డీ ఆడుతున్న రాస్ మహిళా ఉద్యోగులు

తిరుపతి(సెంట్రల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల మానసిక ఉల్లాసానికి క్రీడలను నిర్వహిస్తున్నామని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడు అన్నారు. పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని క్రీడామైదానంలో శనివారం ఆయన జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థలో ఏడాది పాటు నిరంతరం విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఆట విడుపుగా ఏడాదికి ఒక సారి క్రీడలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు డిసెంబరు 31న బహుమతులు అందజేస్తామని చెప్పారు. డైరెక్టర్ వి.నాగరాజు షాట్‌పుట్ వేసి పోటీలను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పండుగ వాతావరణంలో క్రీడా పోటీలు జరిగాయి, కబడ్డీ, షాట్‌పుట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు జరిగాయి. సుమారు 220 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, రాస్ అధికారులు బాలాజీ రెడ్డి, రవి, వెంకటేష్, భార్గవి, వనజ, నాగేశ్వర్, వాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్లో సృజనాత్మక వేడుకలు



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న దృశ్యం

చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం సృజనాత్మక వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వార్షిక స్టీమ్ ఎగ్జిబిషన్‌లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్, గణితం, సోషియల్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎన్ఎస్ఎస్, క్రీడలు, రోబోటిక్స్, డ్యాన్స్, ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ ప్రయోగాలు, సృజనాత్మక కళా నిర్మాణాలు పలువురిని ఆలోచింపజేశాయి. ప్రతి విద్యార్థి తమ హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్ అనుభవాలను సందర్శకులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేష్ పాటిల్ మాట్లాడుతూ మన విద్యార్థుల్లోని సృజనాత్మకతను, అన్వేషణ భావనను, సమస్య పరిషార నైపుణ్యాలను ప్రోత్సహించడమే కాకుండా వారి ప్రతిభను సమాజం ముందు తీసుకురావడం ఈ ప్రదర్శన లక్ష్యమ న్నారు. ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసిన విద్యార్థుల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



డీఎఫ్‌వోకు వినతి ఇస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళం పంచాయతీ పరిధిలోని బీటీఆర్‌కాలనీ 5వ లైనులో ఉన్న కట్టపుట్టాలమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం డీఎఫ్‌వో సాయిబాబాను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని అటవీ అధికారులు కూల్చివేయడంతో స్థానికుల మనోభావాలు దెబ్బతి న్నాయని పేర్కొన్నారు. డీఎఫ్‌వో స్పందిస్తూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

డోలు విభాగాధిపతికి సాదర వీడ్కోలు



తిరుపతి(కల్చరల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుపతి వెంకటేశ్వర నాదస్వర పాఠశాలలో డోలు విభాగాధిపతి రాళ్లపాటి కృష్ణారావును ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక కళాశాల ఆవరణలో జరిగిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్వీ సంగీత నృత్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మృదంగం సుధాకర్, అఖిల భారత నాదస్వర విద్వాన్ సత్యనారాయణ, ప్రముఖ డోలు విద్వాంసులు ఊట్లవారిపల్లి మునిరత్నం, పాఠశాల హెచ్ఎం లక్ష్మీ సువర్ణ పాల్గొన్నారు.

ఎస్వీయూ - ఎస్ఆర్ఎం మధ్య ఎంవోయూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ - ఎస్ఆర్ఎం యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై ఇరు సంస్థల అధికారులు శనివారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి పరిశోధనలకు అవకాశం ఏర్పడిందని వారు పేర్కొన్నారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు, ఎస్ఆర్ఎం వర్సిటీ వీసీ సతీష్‌కుమార్, ఎస్వీయూ రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఎస్ఆర్ఎం వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ నారాయణరావు, ఎస్వీయూ అధికారులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్సు ఏఎస్పీకి సన్మానం



మంగళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు అదనపు ఎస్పీగా బాధ్య తలు స్వీకరించిన కులశేఖర్‌ను శనివారం టీడీపీ నాయకులు సింగంశెట్టి సుబ్బరామయ్య, బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్ ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాకప్పి, పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 37 మందికి తిరుపతి మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి సంధ్యారాణి ఒక్కొక్కరిరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న 49 మందికి రూ.500 మంతున జరిమానా విధించారు.

నేషనల్ కెరీర్ అండ్ స్కిల్ కాంటెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ - ఇస్కాన్ సంయుక్తంగా విద్యార్థుల కోసం నిర్వహించనున్న నేషనల్ కెరీర్ అండ్ స్కిల్ కాంటెస్ట్ - 2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచి, ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే ప్రతిభా పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లే అవకాశాన్ని కల్పిస్తామని ఇస్కాన్ అధ్యక్షులు రేవతి రమణదాస్ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

పాకాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు కోరారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 2024 నుంచి ఉద్యోగ విరమణ చెందిన ఉపాధ్యాయ ఉద్యోగుల గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎల్, ఏపీజీఎల్ఐసీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఓపిఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్‌లో వున్న మెడికల్ బిల్లులను చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి, నాయకులు జ్యోతిప్రసాద్, ఆదికేశవులు, రాజేంద్రుడు, కృష్ణమూర్తి, జయబాల, కేఎన్ తులసీరామన్, విజయమోహన్ పాల్గొన్నారు.

వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించాను

● బీఎస్ఎన్ఎల్ జీఎం అమరేంద్ర రెడ్డి



జీఎంను సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(సెంట్రల్), నవంబరు29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బీఎస్ఎన్ఎల్ జిల్లా (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో బీఎస్ఎన్ఎల్ వినియోగదారలకు నాలుగేళ్లలో సంతృప్తికరమైన సేవలు అందించానని బీఎస్ఎన్ఎల్ జీఎం సి.అమరేంద్రరెడ్డి వెల్లడించారు. శనివారం తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్లో అమరేంద్రరెడ్డి ఉద్యోగ విరమణ సభ జరిగింది. నాలుగేళ్లుగా ఆయన సంస్థ ఆర్థికాభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. సీజీఎంలు, డీజీఎంలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘాల నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీకుమార్, శేషాచలం, జయశంకర్, వెంకోబరావు, దామోదరం, నాయకులు ప్రసాద్, ప్రభాకర్, వైఎస్ రాజు, కె.ఎల్లయ్య, గుర్రప్ప పాల్గొన్నారు.

తిరుపతి

64 గ్రాముల బంగారు నగల చోరీ


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీరాములు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల పరిధిలోని పెరుమాళ్లపల్లిలోని ఓ ఇంట్లో 64 గ్రాముల బంగారు చోరీకి గురైంది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. పెరుమాళ్లపల్లిలో కాపురమున్న పాలపాటి అలేఖ్య స్థానిక సాయి సూపర్ మార్కెట్లో బిల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త బ్రహ్మానందరెడ్డి శ్రీకాళహస్తిలోని గురుకుల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఆమె విధులకు వెళ్లే సమయంలో ప్రతి రోజూ ఇంటి తాళాలు మెట్ల కింద ప్లాస్టిక్ డబ్బాలో ఉంచేవారు. ఈ నెల 27న ఉదయం అందరూ విధులకు వెళ్లారు. పిల్లలు బడికి వెళ్లారు. సాయంత్ర పిల్లలు ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తాళాలు తెరచి ఉండడం గమనించారు. ఇంట్లో ఎక్కడా పగులకొట్టిన ఆనవాళ్లు లేకపోవడంతో దొంగతనం జరగలేదని భావించారు. మరుసటి రోజు 28న ఆమె భర్త ఇంటికి వచ్చి బంధువుల పెళ్లికి వెళ్లడానికి బీరువాలోని బంగారు నగలు పరిశీలించాడు. అందులో వున్న 64 గ్రామలు బంగారు నగలు కనిపించలేదు. జరిగిన ఘటనపై బాధితురాలు అలేఖ్య శనివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ శ్రీరాములు, సిబ్బందితో వెళ్లి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో సత్తాచాటిన దీపిక


మెడల్స్, ట్రోఫీని ప్రదర్శిస్తున్న దీపిక

తిరుపతి(క్రీడలు), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న బాపట్లలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో తిరుపతి విద్యార్థిని దీపిక సత్తా చాటింది. ఎర్రవారిపాళెం మండలం కోటకాడపల్లికి చెందిన దీపిక స్థానిక అనిల్ అద్వైత జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. రాష్ట్రస్థాయి అండర్-19బాలికల విభాగంలో ట్రెడిషనల్, ఆర్టిస్ట్ యోగాసనాల్లో ప్రతిభ కనబరిచింది. రెండింటిలోనూ ద్వితీయస్థానం సాధించి కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. క్రీడా ప్రముఖులు ఆమెను అభినందించారు.

ఆర్టీసీకి 100 ప్రథమ చికిత్స కిట్ల వితరణ


ప్రథమచికిత్స కిట్లను వితరణ చేస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి యాజమాన్యం శనివారం ఏపీఎస్ ఆర్టీసీకి 100ప్రథమ చికిత్స కిట్లను వితరణ చేసింది. ఈ కిట్లను బస్సుల్లో ఏర్పాటు చేయాలని ఆస్పత్రి వైద్యులు గుణమాధురి తిరుపతి డిపో మేనేజర్ సురేంద్రకుమార్‌ను కోరారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న హైమావతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. తిరుపతిలోని మహిళా ప్రాంగణంలో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉమెన్ స్టడీస్ ప్రతినిధి హైమావతి అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు గురయ్యే వారు నిర్భయంగా తమ సమస్యను చట్టబద్ధంగా ఎదుర్కోవచ్చన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడం ద్వారా బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇంద్రాణి, ప్రీతి, మహిళలు పాల్గొన్నారు.

డాక్టరేట్ స్వీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీ యోగ విజ్ఞాన గెస్ట్ ఫ్యాకల్టీ డి.సరిత డాక్టరేట్ పొందారు. మధ్య ప్రదేశ్‌లోని శ్యాం గ్లోబల్ యూనివర్సిటీలోని యోగా విభాగంలో ప్రొఫెసర్ అఖిలేష్‌కుమార్‌సింగ్ పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ యోగా ఇంటర్‌వెన్షన్ ఆన్ నియోనాటల్ ఔట్ కమ్స్' అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. భోపాల్‌లో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ డాక్టరేట్ పొందారు. గతంలో ఎస్వీయూ కెమిస్ట్రీ విభాగం నుంచి కూడా ఆమె డాక్టరేట్ పొందారు.

మూడు పుణ్యక్షేత్రాలను దివ్యధామంగా ప్రకటించాలి

తిరుపతి(జీవకోన), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి, తిరుచానూరు పుణ్యక్షేత్రాలను దివ్యధామంగా ప్రకటించాలని గ్లోబల్ హిందు హెరిటేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెలగపూడి ప్రకాష్‌రావు ప్రభుత్వానికి కోరారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాధామంగా ప్రకటించాలని టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ అన్నారన్నారు. దేవదాయ, ధర్మాదాయశాఖను రద్దుచేయాలని, టీటీడీ పరిధిని 27.5 చదరపు కిలోమీటర్ల నుంచి 250 చదరపు కిలోమీటర్లకు విస్తరించాలన్నారు. తాము ఎక్కడా విరాళాలు సేకరించలేదని తమపై నిరాధార ఆరోపణలు చేసిన శివస్వామి, టీటీడీపై చర్యలు తీసుకోవడానికి న్యాయనిపుణులతో చర్చిస్తున్నామన్నారు. చేతన్, శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి, రమణ, రమాదేవి పాల్గొన్నారు. కాగా తిరుచానూరులో నవజీవన్ ఆశ్రమంలో జరిగిన సమావేశంలోనూ ఇదేవిషయం మాట్లాడారు.

జేసీఐ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



తిరుపతి(కల్చరల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని చక్రీ హోటల్లో శనివారం జేసీఐ సంస్థ కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా జి.రాజేష్‌కుమార్, అధ్యక్షులుగా ఎం.జయలక్ష్మి, కార్యదర్శిగా ఎం.దొరస్వామిరాజు, కోశాధికారిగా టి.ఉమామహేశ్వర్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఉమా వెన్నం ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ సంస్థ జాతీయ కమిటీ అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి, జోనల్ అధ్యక్షులు ప్రమోద్‌కుమార్, సభ్యులు జీఎల్.మనోహర్, హరిప్రసాద్, ప్రదీప్, కృష్ణమూర్తి, సోమయ్య, రమణన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మినీ క్రికెట్ స్టేడియం పనులు నిర్ణీత కాలంలో పూర్తిచేయాలి

● శాప్ చైర్మన్ రవినాయుడు


నిర్మాణంలో ఉన్న గొల్లవానిగుంట క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం గొల్లవానిగుంటలో జరుగుతున్న మినీ క్రికెట్ స్టేడియం పనులు నిర్ణీత కాలంలో పూర్తిచేయాలని శాప్ చైర్మన్ రవినాయుడు కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం సాయంత్రం ఆయన యాదవకార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, తాతయ్యగుంట గంగమ ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్‌తో కలసి క్రికెట్ మైదానం, పెవిలియన్ బిల్డింగ్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వేదికలు, ఇతర పనులను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశమయ్యారు. పనులు వచ్చేనెలాఖరులోపు పూర్తిచేసి, క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్, డీఎస్‌డీవో శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

4న గోవిందరాజస్వామి ఆలయంలో దీపోత్సవం

తిరుపతి(కల్చరల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో డిసెంబరు 4వ తేదీన సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహించ నున్నట్లు టీటీడీ తెలిపింది. అలాగే తిరుమంగైయాళ్వార్ శాత్తుమొర నిర్వహించనున్నారు. 5న రోహిణీ నక్షత్రం సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత పార్థ సారథి స్వామి వారి ఊరేగింపు జరగనుంది.

కబీర్ కవితల అనువాద గ్రంథం ఆవిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న సాహిత్య ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాత్విక స్థాయి గల రచయిత తిరువాయిపాటి రాజగోపాల్ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర పేర్కొన్నారు. తిరువాయిపాటి రాజ గోపాల్ అనువదించిన కబీరుదాసు వంద కవితల పుస్తకాన్ని తిరుపతిలో శనివారం ఆవిష్కరించారు. బైరాగిపట్టెడలో గల ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర పుస్తకావిష్కరణ చేసిన అనంతరం ప్రసంగించారు. ఆనందమే పరమావధిగా రచనా వ్యాసంగం చేస్తున్న కవి తిరువాయపాటి రాజగోపాల్ అని అభిప్రాయపడ్డారు. దేశం గర్వించదగ్గ గొప్ప రచయిత కబీర్ అని కొనియాడారు. కబీర్ కవితా సారాన్ని ఈ తరం అర్థం చేసుకోవాలని కోరారు. రచయిత శైల కుమార్ పుస్తక సమీక్ష చేస్తూ.. జీవిత తాత్వికతను సరళ రీతిలో కబీర్ చెప్పారన్నారు. ఆ సొగసులు రాజగోపాల్ తెలుగుసేతలో చోటు చేసుకున్నాయని తెలిపారు. శంకరంబాడి పీఠం వ్యవస్థాపకులు మస్తానమ్మ అధ్యక్షత వహించారు. పుస్తక గురించి రంగస్థల కళాకారుడు వేణుగోపాలన్, తెలుగు భాషోద్యమ సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ మాట్లాడారు. అనంతరం రచయిత తిరువాయపాటి రాజగోపాల్‌ను తిరుపతి సాహితీ మిత్రులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాకం నాగరాజ, గార్లపాటి దామోదరనాయుడు, తోట వెంకటేశ్వర్లు, పేరూరు బాలసుబ్రమణ్యం ఆర్. సీకే.రాజు, ఇస్లాపురం బాలసుబ్రమణ్యం, మేఘనా గుల్జార్, చెన్నకేశవులు నాయుడు, నెమిలేటి కిట్టన్న, కాంతారావు, నాగార్జున, కిరణ్, శ్రీధర్‌తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవో నగర కార్యవర్గం ఏకగ్రీవం

● అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా లలిత్ కుమార్


ఏపీ ఎన్జీవో నగర కార్యవర్గం

తిరుపతి(వైద్యం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో తిరుపతి నగర అధ్యక్షులుగా ఎం. శ్రీనివాసులు, కార్యదర్శిగా బి.లలిత్‌కుమార్ ఎన్నికయ్యారు. సంఘం తిరుపతి నగరశాఖ కార్యవర్గం ఎన్నికలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.రమణ, సహాధ్యక్షులుగా పి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీధర్, బి.రజని, బి. రాజగోపాల్, సి.మోహన్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షులుగా టి.భువనేశ్వరి, సహకార్యదర్శులుగా టి.శ్రీచరణ్, కేవీ కొదండరామయ్య, కె.జైశంకర్, ఎస్. రూపాశ్రీకాంత్, పి.వాణిశ్రీ, మహిళా సహ కార్యదర్శిగా పద్మజ, కోశాధికారిగా చెన్నకేశవులు, ఈసీ మెంబర్లుగా ఎం.లావణ్య, ఎం.మునిచంద్ర, సి.గంగాధర్, పి.కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సదర్భంగా తిరుపతి జిల్లా చైర్మన్ సురేష్‌బాబు ఎన్నికైనవారికి అభినం దనలు, ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికలకు ఈశ్వరయ్య, ఎన్నికల అధికారిగా, స్వర్ణలత ఉప ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా రఘు వ్యవహరించారు.

3న కృత్తికా దీపోత్సవం

తిరుపతి(కల్చరల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో డిసెంబరు 3వ తేదీన కృత్తిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ శనివారం తెలిపింది. కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం ఈ దీపోత్సవం నిర్వహిస్తున్నారు. గర్భాలయంలో, ఆలయ శిఖరాలపై దీపారధన చేయనున్నారు. రాత్రి పుష్కరిణి వద్ద జ్వాలాతోరణం ఏర్పాటు చేయనున్నారు.

'స్కూల్‌లైఫ్' హృదయాన్ని కదిలిస్తుంది

● సినిమా బృందం



తిరుపతి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి హృదయాన్ని కదిలిస్తూ స్కూల్ జ్ఞాపకాలను గుర్తు చేసేదే 'స్కూల్ లైఫ్' చిత్ర కథాంశమని ఆ సినిమా దర్శకుడు శాన్విసూర్య, నటులు జయకృష్ణ, నరేష్ జిట్ల అన్నారు. ఆ సినిమా బృందం శనివారం సాయంత్రం స్థానిక మినీప్రతాప్ థియేటర్‌ను సందర్శించింది. ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించింది. అనంతరం వారు మాట్లాడుతూ మనిషి జీవన గమనంలో పాఠశాల ఒక అద్భుతమైందని గుర్తుచేశారు. కుటుంబ సమేతంగా తిలకించే రీతిలో రూపొందించామన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి(విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు, బుక్‌లెట్లను ఉచితంగా అందజేశారు. స్థానిక ముత్యాలరెడ్డిపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి సీఐలు సంజీవ్‌కుమార్, భాస్కర్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి తోకలిసి 30 మంది విద్యార్థులకుమెటీరియల్‌ను అందజేశారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ యూటీఎఫ్ టెస్ట్‌పేపర్లు, ఇతర మెటీరియల్ చక్కగా ఉందని వాటిని బాగా చదివితే 90 శాతం మార్కులు సాధించవచ్చని తెలియజేశారు. రాబోయే మూడు నెలలు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

మహిళలకు వ్యాపారంపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వ్యాపారంపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. తిరుపతి టీటీడీ సీలో శనివారం జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీఆర్పీల ద్వారా వ్యాపారం చేసే మహిళలకు ప్రభుత్వం అందించే రుణాలు, అందుకోసం దరఖాస్తు చేసుకునే విధానంపై అవ గాహన కల్పించాలన్నారు. రైతు ఉత్పాదక సంఘాలు ఆధునిక వ్యవసాయం చేసే విధంగా మహిళా సంఘాలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ ప్రభావతి, ఐబీడీపీఎం వెంకటేష్, ఏపీఎంలు పాల్గొన్నారు.

తిరుమలవాసుల గ్యాస్ సమస్యలపై జనసేన ఆరా



తిరుమల, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికులకు గ్యాస్ సిలిండర్లు సరిగా అందడం లేదనే అంశంపై తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టిసారించారు. వివరాలు తెలుసుకోవాల్సిందిగా జనసేన తిరుమల నేతలు జీవన్ రాయల్, మంజు రాయల్‌కు సూచించడంతో వారు శనివారం తిరుమలలోని గ్యాస్ సిలిండర్ల సరఫరా విధానాన్ని స్వయంగా పరిశీలించారు. తిరుమలలో గ్యాస్ గోడౌన్ ఏర్పాటుపై కూడా సంబంధిత అధికారులతో చర్చించారు. త్వరలో ఎమ్మెల్యేకు విషయాలను తెలియజేస్తామని జనసేన నేతలు తెలిపారు.

వైసీపీ భూకబ్జాల చిట్టా బయటపెడతా

● జనసేన నాయకుడు రాజారెడ్డి
● జగన్ పత్రికలో తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు


ఎస్బీఐ డీఎస్పీ మద్దయాచారికి ఫిర్యాదు చేస్తున్న రాజారెడ్డి, జనసైనికులు

తిరుపతి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశంతో తప్పుడు కథనాలు ప్రచురించిన జగన్ పత్రిక సాక్షిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన తిరుపతి నగరాధ్యక్షుడు రాజారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం ఎస్బీఐ సీఐ మద్దయాచారికి ఫిర్యాదు పత్రం అందజేశారు. కూటమి నాయకుల్లో ఎవరైన తప్పు చేసినట్లు ఫిర్యాదు అందినా కూడా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జగన్ పత్రికలో రాసే కథనాలను సాక్ష్యాధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో భూములను కాజేసిన వివరాలు, దౌర్జన్యాలు, కుంభకోణాలు, అక్రమ సంపాదనను సాక్ష్యాధారాలతో సహా బహిర్గతం చేస్తానన్నారు. ఆ వివరాలను సాక్షి పేపర్‌లో ప్రచురించే ధైర్యముందా అని సవాల్ విసిరారు. చింతలచేనులో చెరువు కబ్జా చేశారని, మున్సిపల్ ల్యాండ్స్, చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కాలువపోరంబోకులతోపాటు కట్టకింద ఊరులో 94సెంట్ల కాలువపోరంబోకు స్థలం మాయమైందని, అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయించింది వైసీపీ నాయకుడు కాదా అని ప్రశ్నించారు. మాస్టర్‌ప్లాన్ రోడ్డులో మాజీ ఎమ్మెల్యేకి, ఆయన కుమారుడికి, ఆ డివిజన్ కార్పొరేటర్‌కు ఎంతెంత భూములున్నాయి. ఎంత ఆక్రమించుకున్నారో తేలుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు సుభాషిణి, బాబ్జి, హేమకుమార్, మధులత, సుమన్‌బాబు, దినేష్‌జైన్, మునస్వామి, కిషోర్, రాజేష్‌ఆచారి, వెంకటేష్, బాలాజి, పురుషోత్తం, శ్రావణ్, వంశీ, అయ్యప్ప, అలీ పాల్గొన్నారు.

స్ఫూర్తి



గుడుపల్లె మండలం యామగానిపల్లె స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తూ

జపాన్ హక్కయిడో యూనివర్సిటీలో పీహెచ్‌డీ రీసెర్చ్ గ్రూప్ సభ్యులతో

SUNDAY SPECIAL

కుప్పం కుర్రోడి జపాన్ జర్నీ

అమ్మానాన్నల వెంట పొలంలో కూలిపనులకు వెళ్లిన పిల్లవాడు... బస్సు క్లీనర్‌గా బతుకును ఈడ్చుకొచ్చిన యువకుడు.. చదువుల వంతెన మీదుగా కుప్పం పల్లెనుంచి జపాన్‌కు ఎగిరిపోయాడు. క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో నైపుణ్యం సాధించాడు. పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. జపాన్‌లో ప్రస్తుతం అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో పనిచేస్తున్నాడు. మూలాలు మరచిపోకుండా ఇక్కడి విద్యార్థులకూ మార్గదర్శకుడిగా సేవలందిస్తున్నాడు. గోవిందపల్లె పిలగాడు మురుగేశ్ చదువులయాత్ర విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం..

> మా అమ్మానాన్నలను బెంగళూరునుంచి చెన్నైదాకా విమానంలో తీసుకువెళ్లా. ఈ ప్రయాణం నాకు గొప్ప ఆనందాన్నిచ్చింది. పేదరికం, పల్లె చదువులు.. అని నిరాశ చెందనవసరం లేదు. నిరంతర శ్రమ, పట్టుదల, దృఢ సంకల్పం.. ఇవే నన్ను ఈ స్థితికి చేర్చాయి.

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం, గుడుపల్లె మండలంలో మారుమూల ఉండే గ్రామం గోవిందపల్లె. మురుగేశ్ పుట్టిన ఊరు ఇది. తల్లిదండ్రులు మునస్వామి, యల్లమ్మ బక్క రైతులు. కూలి పనులతోనే జీవనం సాగించేవారు. అమ్మానాన్నల వెంట కూలి పనులకు వెళ్లడం మురుగేశ్‌కూ తప్పేది కాదు. అయితే చిన్నప్పటి నుంచీ చదువులో ముందుండేవాడు. గుడుపల్లె మండలం శెట్టిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08లో టెన్త్ పరీక్షల్లో 542 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇంజనీరింగ్ చేయాలన్నది మురుగేశ్ కల. ఇంటర్ చదువులకే ఆర్థిక స్తోమత లేదు. వేసవి సెలవుల్లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తూ డబ్బులు పోగేసుకున్నాడు. రోజూ ఇంగ్లీషు పేపర్ కొని క్రమం తప్పకుండా చదివేవాడు.

ట్రిపుల్ ఐటీ దారి చూపింది

పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నాటి ప్రభుత్వం కల్పించిన అవకాశం వరంగా మారింది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మురుగేశ్‌కి సీటు లభించింది. అక్కడే ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంజనీరింగ్ పట్టా కూడా పొందాడు. ఆ తర్వాత విదేశాల్లో చదవాలన్న కోరికకు పేదరికం అడ్డొచ్చింది. అయినా ఆశ వదులుకోలేదు. పట్టుదలను కోల్పోలేదు. మూడేళ్లపాటు ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాసులలో పరిశోధనా మెలకువలు నేర్చుకుంటూ ఉన్నత చదువులకు తయారవుతూ వచ్చాడు. ఇది మురుగేశ్‌కి గొప్ప ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. మద్రాసు ఐఐటీలో మాస్టర్స్ ఎం.ఎస్. రీసెర్చ్ పట్టా పొందగలిగాడు.

జపాన్‌లో పీహెచ్‌డీ

ఐఐటీ చదువుల నిచ్చెన ఆసరాతో జపాన్ వైపు అడుగులు వేశాడు. పూర్తి స్కాలర్‌షిప్‌తో జపాన్‌లో పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఆధ్యాత్మికపరమైన క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో పనిచేశాడు. గోవిందపల్లె పిలగాడు.. డాక్టర్ మురుగేశ్‌గా గౌరవం అందుకున్నాడు. జపాన్‌లో అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో ఇప్పుడు పనిచేస్తున్నాడు. ర్యాపిడస్ ఇంక్ జపాన్ కంపెనీలో ప్రాసెస్ ఇంజనీరు అతని హోదా.

బీజాలు వేసిన ఫిజిక్స్ టీచర్

ఇదంతా అంత సులువుగా జరగలేదు. కెరీర్‌లో మురుగేశ్ ఎక్కిన ప్రతి మెట్టు వెనుక ఎంతో శ్రమ ఉంది. స్ఫూర్తి నింపి ముందుకు నడిపించిన గురువుల పాత్ర ఉంది.2012లో ప్రాణిక్ హీలింగ్‌ను మురుగేశ్‌కు పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు మీనా పరిచయం చేశారు. ప్రాణిక్ హీలింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ శిక్షణా తరగతుల నుంచి, మాస్టర్ డేవిడ్ విజయకుమార్ ద్వారా ప్రేరణ పొందాడు. పీహెచ్‌డీలో కూడా ప్లాస్మా ప్రాసెసింగ్ రీసెర్చ్ సబ్జెక్టును అర్థం చేసుకోవడానికి ఈ ఇద్దరూ దారి చూపారని చెబుతారు మురుగేశ్.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ

మారుమూల గ్రామం గోవిందపల్లె నుంచి జపాన్‌లో ఉన్నతోద్యోగంలో ఉన్న మురుగేశ్ యూట్యూబ్ చానల్ ద్వారానూ, ప్రత్యక్షంగానూ స్ఫూర్తి నింపే పనులు చేస్తున్నారు. భారతదేశంలోను, జపాన్‌లోను వివిధ కళాశాలలు, పాఠశాలలు సందర్శిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నారు. తన సొంత మండలమైన గుడుపల్లెలోని విద్యార్థులకూ అండగా నిలుస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను జపాన్‌లో పరిచయం చేస్తూ, అందులోని విలువలను తెలియజెప్పుతున్నారు.



జపాన్‌లో మన సంస్కృతీ సంబరాలలో

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,044

తలనీలాలు సమర్పించినవారు: 25,559

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాదరావు కోరారు. రబీ 2025-26 సంవత్సరానికిగాను దిగుబడి ఆధారంగా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ (పునర్వ్యవస్థీకరించ బడిన వాతావరణ ఆధారిత బీమా పథకం కింద) జిల్లాలో వరి, వేరుశనగ పంటలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వరికి గ్రామం, వేరుశనగకు మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. వరికి బీమా రూ.42వేలు కాగా ఎకరాకు రైతులు బీమా ప్రీమియం రూ.630, వేరుశనగకు రూ.30వేలు కాగా రూ.450 కట్టాల్సి ఉంటుందని వెల్లడించారు. వరికి డిసెంబరు 31, వేరుశనగకు డిసెంబరు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్(ఎన్‌సీఐఊఈ)లో బీమాను నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

కావాల్సిన పత్రాలు

పంట బీమా నమోదు చేసుకునే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులు అయితే సీసీఆర్‌సీపత్రం, రైతు సేవా కేంద్రంలో జారీచేసే పంట సాగు ధ్రువీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, ఫోన్ నంబరు, రైతు బ్యాంకు ఖాతా మొదటి పేజీ కాపీని సమర్పించాల్సి ఉంటుంది.

నారాయణవనం తహసీల్దార్ కార్యాలయానికి తాళం

- ఫిర్యాదు చేసిన తహసీల్దార్

నారాయణవనం, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనం తహసీల్దార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు వేశారు. ఈ సంఘటన శనివారం ఉదయం కలకలం రేపింది. నారాయణవనంలో సచివాలయం 3 ఉన్న భవనం కింద అంతస్థులో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు సిబ్బంది కార్యాలయానికి చేరుకోగా వేరే తాళాలు వేసినట్టు గుర్తించారు. వెంటనే తహసీల్దారుకు సమాచారం అందించారు. తహసీల్దార్ రోజారాణి కార్యాలయానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవీంద్ర సిబ్బందితో చేరకుని తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తాళాలు వేసియున్న తహసీల్దార్ కార్యాలయం



అవగాహన ర్యాలీలో సిబ్బంది

ఎఫ్‌పీవోల బలోపేతానికి సహకారం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీమాస్, వాసన్ ఎన్‌జీవోల భాగస్వామ్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. రైతు సంఘాల అభివృద్ధిపై జిల్లాలోని 13 మండలాలకు చెందిన ఏపీఎం, సీసీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్ మెంబర్లకు టీటీడీసీలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీవోల అభివృద్ధికి సెర్ప్, ఎన్ఆర్ఎల్ఎం ప్రాజెక్టు నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. పంటలను నేరుగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయలక్ష్మి, సుధాకర్, ఏపీడీ ప్రభావతి, వెంకటేష్, దాక్షాయని పాల్గొన్నారు.

ఎస్వీయూలో 'అన్వేషణ్'



అన్వేషణ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అన్వేషణ్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ సెనెట్ హాల్లో వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, సీడీసీ డీన్ చెంగ్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి పెంచి, తద్వారా అనేక సామాజిక సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరారు. ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, హెల్త్ సైన్స్, న్యూట్రిషన్ రంగాల్లో వివిధ కాలేజీల విద్యార్థులు తమ ఆలోచనలకు పోస్టర్, ఓరల్, పేపర్ ప్రెజంటేషన్ రూపమిచ్చారు. వీటిని పరిశీలించిన వీసీ అభినందించారు. ఈ ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

శ్రీసిటీలో ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం

సత్యవేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం శనివారం ముగిసింది. శ్రీసిటీ - శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ బృందం ఈనెల 23న ఆలయ ఆవరణలో భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. 25 మంది సభ్యులు వారం రోజుల పాటు ఉదయం 6 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భక్తిశ్రద్ధలతో 12స్కంధాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠనాన్ని ప్రారంభించి ఈనెల 29న శనివారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. తమకు ఈ అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీసిటీ అధినేత డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి భాగవత భక్త సమాజ సభ్యులను శాలువలతో సత్కరించి స్వామివారి తీర్థ, అన్న ప్రసాదాలను అందజేశారు. శ్రీసిటీ ప్రతినిధులు వీఎస్‌బీ శాస్త్రి, పల్లేటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భాగవత సప్తాహ పఠనం చేస్తున్న భాగవత భక్త సమాజ బృందం



నేడు మిస్ యూనివర్స్ ఏపీ సైకిల్ యాత్ర

- శ్రీకాళహస్తి నుంచి మొదలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నుంచి హైదరాబాద్ వరకు 600 కిలోమీటర్ల మేర మిస్ యూనివర్స్ ఏపీ చందనా జయరామ్ సైకిల్‌యాత్ర జరగనుంది. మహిళ సాధికారత ప్రచార ధ్యేయంతో ఈ యాత్ర సాగుతుంది. పలు ప్రైవేటు సంస్థలు స్పాన్సర్లుగా శ్రీకాళహస్తి నుంచి ఈ యాత్రను ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. పట్టణంలోని భేరివారి మండపం నుంచి ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ప్రారంభించనున్నారు.

ఐసర్‌తో కలిసి పనిచేస్తాం: టాటా స్టీల్




తిరుపతి ఐసర్‌లో టాటా స్టీల్ రీసెర్చ్ గ్రూప్ చీఫ్ ప్రతీక్ స్వరూప్

ఏర్పేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐసర్‌తో కలిసి నూతన ఆవిష్కరణల కోసం పనిచేస్తామని జంషెడ్‌పూర్ టాటా స్టీల్ సస్టైనబిలిటీ రీసెర్చ్ గ్రూప్ చీఫ్ డాక్టర్ ప్రతీక్‌కుమార్ దాస్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ఉన్న తిరుపతి ఐసర్‌ను సందర్శించారు. ఐసర్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ బలరామన్‌ను కలిశారు. కెమిస్ట్రీ విభాగంలో విద్యార్థులకు అవకాశాల కల్పన, అకడమిక్- ఇండస్ట్రీని సమ్మిళితం చేయడానికి ఐసర్‌తో కలిసి పనిచేస్తామన్నారు. నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించడంలో భాగంగా హైడ్రోజన్ ఉత్పత్తి, స్టోర్డ్‌బయోమాస్, లిక్విడ్ ఫ్యూయెల్స్ ఉత్పత్తి వంటి అంశాల్లో పరస్పర సహకారం అందించుకునేలా ఐసర్‌తో కలిసి పనిచేస్తామని వివరించారు.



గౌతమ బుద్ధుని వృత్తాంతం

తమిళనాడులోని దక్షిణ చిత్ర మ్యూజియంలో విజయకుమార్‌చే కలంకారీ శిక్షణ పొందుతున్న యూరప్ వాసులు





కృష్ణ లీలలు

ఆవులకొండ విజయ్‌కుమార్ కన్నుమూత

శ్రీకాళహస్తికి చెందిన ప్రసిద్ధ కలంకారీ కళాకారుడు ఆవులకొండ విజయకుమార్ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన పెంకులపాడులో ఇంటి వద్దనే ఆయన మృతి చెందారు. కలంకారీ కళాకారుడిగానే కాక, కలంకారీ గురువుగా విజయకుమార్ పేరుపొందారు. దేశ, విదేశాలకు చెందిన ఎందరికో కాళహస్తి కలంకారీ కళను నేర్పించారు. ఎనిమిది పదుల వయసులోనూ కలంకారీ నేర్చుకుంటామని వచ్చే వారికి ఓపిగ్గా నేర్పించేవారు. ఇటీవలే తమిళనాడుకు చెందిన నలుగురు రెండు నెలలపాటు శిక్షణ పొందేందుకు ఆయన వద్దకు వచ్చారు. శిక్షణ పూర్తికాకముందే అనారోగ్యంతో ఆయన కన్నుమూశారు. విజయకుమార్‌కు నివాళిగా ఆయన కళాజీవనయాత్ర విశేషాలు..

■ నివాళి

కలంకారీ గురువు

కనకదుర్గమ్మ

1968లో విజయ్ కుమార్ శ్రీకాళహసిలోని కలంకారి శిక్షణ శిబిరంలో విద్యార్థిగా చేరారు. రెండేళ్లపాటు ఎ. మునికృష్ణయ్య, రమణయ్య, రాంబోజి నాయక్ వద్ద శిక్షణ పొందారు. ఆ తర్వాత అదే శిబిరంలో నాలుగు సంవత్సరాల పాటు బొమ్మలు గీసే కళాకారుడిగా శిక్షణ ఇస్తూ, పని చేశారు. రోజువారి వేతనంపై కలంకారి బొమ్మలు గీశారు. 1976 నుంచి ఈ శిక్షణ శిబిరం అనేక ఆటుపోట్లు ఎదుర్కొని 1988లో శాశ్వతంగా మూతపడింది. ఆ తర్వాత ఆయన కలంకారీ చిత్ర రచనమీదకన్నా శిక్షణ మీద ఎక్కువ దృష్టి పెట్టారు. స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం ఔత్సాహికులు ఆయన వద్ద శిక్షణ పొందారు.ఫ్రాన్స్ దేశం నుంచి ఆంద్రే దంపతులు ప్రత్యేకంగా ఏడాదిలో వారం రోజులు శ్రీకాళహస్తిలో ఉంటూ పది సంవత్సరాలు పాటు విజయ్ కుమార్ వద్ద కలంకారీ రాతపని నేర్చుకున్నారు. శ్రీకాళహస్తిలో ఎన్నో శిక్షణా శిబిరాలు నిర్వహించారు. కావలిలో రెండు బ్యాచ్‌లకు ట్రైనింగ్ ఇచ్చారు. తమిళనాడు మహాబలిపురం రోడ్‌లోని దక్షిణచిత్ర మ్యూజియంలో 2000 సంవత్సరం నుంచి 2020 వరకు కలంకారి గురువుగా వారాంతపు రోజుల్లో పలువురికి నేర్పించారు. యూరప్ ఖండం నుంచి 14 దేశాలకు చెందిన కళాభిమానులు ఈయన వద్ద కలంకారీ నేర్చుకున్నారు. వారానికి ఒక రోజు బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనూ, మరొక రోజు చెన్నైలోని నిఫ్ట్ కళాశాలలోనూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవారు. కరోనా తర్వాత తన శిక్షణా కార్యక్రమాలను శ్రీకాళహస్తిలోని ఇంటికే పరిమితం చేసుకున్నారు. నాలుగేళ్లుగా చెన్నై ఫైనార్ట్స్ కళాశాల విద్యార్థులు శ్రీకాళహస్తికే వచ్చి శిక్షణ పొందేవారు. శ్రీకాళహస్తిలో కరుణ అనే పేరుతో కలంకారీ కళాకారుల సంక్షేమ అసోసియేషన్ కూడా ఆయన ఏర్పాటు చేశారు. కలంకారీ కళాకారుడిగా విజయ్‌కుమార్ భారతం, రామాయణం, కృష్ణ లీలలు, భాగవతం, గౌతమ బుద్ధుని వృత్తాంతం, అష్టలక్ష్మి, దశావతారాలు వంటి ఇతిహాస చిత్రాలను కలంకారీలో గీశారు. 55 ఏళ్ల క్రితం కలంకారి వృత్తి నేర్చుకున్న తొలి నాళ్లలో వేసిన కనకదుర్గమ్మ, గీతోపదేశం, గౌతమ బుద్ధ వృత్తాంతం చిత్రాలను మాత్రం ఇప్పటికీ బాల్యానికి గుర్తుగా తన వద్దే భద్రపరచుకున్నారు. 'హస్త కళల్లో కలంకారీ ఒక అద్భుతం. వస్త్రంపై బొమ్మలు గీసి సహజ సిద్ధమైన ప్రకృతి రంగులను అద్దటం పురాతన ప్రక్రియ. యాంత్రీకరణ ఎప్పటికప్పుడు అన్ని రంగాలపై ప్రభావం చూపుతున్నా కలంకారీ హస్తకళకు మాత్రం ఆదరణ తగ్గలేదు.' అని ఆయన చెప్పేవారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

పుత్తూరు వార్తలు

వివాదాస్పద మామిడి తోట పరిశీలన


రైతులకు మాట్లాడుతున్న తహసీల్దార్

పుత్తూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలకృష్ణాపురం కాలనీ గిరిజనుల అనుభవంలోని మామిడితోటను తహసీల్దార్ పరిశీలించారు. తొరూరు సర్వే నెం.35-2లోని రెండున్నర ఎకరాల తోట తనదేనంటూ స్థానికేతరుడు కోర్టుకెక్కడంతో శుక్రవారం గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో తోటను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానని చెప్పారు. మండల సర్వేయరు శేషమరాజు, సిపిఎం నాయకుడు వెంకటేశ్, గ్రామస్థులు రామచంద్రయ్య, రాఘవమ్మ, నాగభూషణం, కాంతారావు, గోపి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుడికి ఐఎస్‌టీఈ అవార్డు

పుత్తూరు,నవంబరు29(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుడు వెంకటేశ్ ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ) బెస్ట్ టీచర్ అవార్డును కేంద్ర మాజీ మంత్రి సత్యపాల్ సింగ్ నుంచి అందుకున్నారు. శనివారం పుదుచ్చేరిలో ఐఎస్‌టీఈ వార్షిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ రెండురోజుల పాటు డిప్లొమా విద్యార్థులకు ఐఎస్‌టీఈ వర్క్‌షాపును నిర్వహించామని తెలిపారు.

టెండర్లు పిలిచిన పనులకు ఆమోదం తెలపరా?

రసాభాసగా పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


చైర్మన్ హరిని నిలదీస్తున్న జీవరత్నం నాయుడు

పుత్తూరు అర్బన్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ మోకాలడ్డుతోందని టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నం నాయుడు మండిపడ్డారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జీవరత్నం నాయుడు మాట్లాడుతూ... రూ.2 కోట్ల బీపీఎస్ నిధులతో టెండర్లు పూర్తయిన పనులను ఆమోదించక పోవడంపై ప్రశ్నించారు. అయితే ప్రస్తుతం నిర్వహించిన టెండర్లు రద్దు చేసి తాము కొత్తగా ప్రతిపాదించే పనులకు టెండర్లు పిలవాలంటూ చైర్మన్ అధికారులను కోరారు. అభివృద్ధి పనులకు అడ్డుపడుతుండటంతో నిధులు వెనక్కు వెళ్లే పరిస్థితి ఉందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ గాలి జీవరత్నం నాయుడు అన్నారు. ఏడు అంశాలతో కూడిన అజెండాలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి చేసిన టెండర్ ప్రక్రియను ఆమోదించలేదు. అలాగే పారిశుధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పబ్లిక్ హెల్త్ వర్కర్ నియామకాన్ని వాయిదా వేశారు. డ్వాక్రా మహిళలకు రుణాలు అందడం లేదని 16వ వార్డు వైసీపీ కౌన్సిలర్ సభ దృష్టికి తీసుకు రాగా గత ప్రభుత్వ హయాంలో 16వ వార్డుకు చెందిన ఆర్పీ... సంఘ సభ్యులకు చెందిన రూ.24 లక్షలను, 14వ వార్డుకు చెందిన ఆర్పీ... రూ.14 లక్షలు స్వాహా చేశారని జీవరత్నం నాయుడు ఆరోపించారు. ఇంత వరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోక పోగా, కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. అలాగే పట్టణంలో దోమలు, కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. వాటి నియంత్రణకు కౌన్సిల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్ల విషయంలో వైసీపీ కౌన్సిలర్లు ఆరోపణలు చేయగా, గత ప్రభుత్వంలో ఇళ్లను బ్యాంకులకు తనఖా పెట్టి రుణాలు పొందిన అంశాన్ని జీవరత్నం నాయుడు గుర్తుచేశారు. అలాగే రెండు, మూడు నెలల్లో 423 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించనున్నట్లు వెల్లడించారు. మిగిలిన 600 మంది లబ్ధిదారులకు ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పారు. కాగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించిన క్రమంలో కమిషనర్ హాజరయ్యారు. డీఈ లోకేష్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు.

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండండి

పుత్తూరు అర్బన్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో దిత్వా తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శిథిలావస్థకు భవనాల్లో నివాసం ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. హెల్ప్‌లైన్ నెం.7075067503కు ఫోన్ చేసిన వెంటనే ఏఈ కార్తికేయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్ కృష్ణ నేతృత్వంలోని రెస్క్యూ టీం సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉంటుందని వెల్లడించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని విన్నవించారు.

గృహనిర్మాణ లబ్ధిదారుల గుర్తింపు

వడమాలపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే ద్వారా మండలంలో గృహనిర్మాణ లబ్ధిదారుల గుర్తింపు పూర్తయ్యిందని తహసీల్దార్ జరీనా చెప్పారు. గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 401 వినతులకు సంబంధించి రెవెన్యూ సిబ్బందితో సంబంధిత స్థలాలను, ఇంటి యజమానుల సతల అనుభవాన్ని పరిశీలించామన్నారు. ఇందులో 293 మంది అర్హులుగా గుర్తించగా 78 మందికి తగిన ఆధారాలు లేక నిలిపివేశామన్నారు. 30 మందికి ఆధారాలు అందించాలని తాత్కాలికంగా పెండింగులో ఉంచినట్లు తెలిపారు. కాగా ఉన్నతాధికారులకు నివేదిక పంపి 293 మందికి అనుభవ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామిని స్వర్ణాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలలో అధిష్ఠింపజేసి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివార్లకు మంగళహారతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన అల్లాభక్షు అభినందన సభ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. పంచాయతీ కార్యదర్శుల తరఫున అల్లాభక్షుకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. అల్లాభక్షు సేవలను ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు కొనియాడారు.

గిరిజనకాలనీలో సివిల్ రైట్స్ డే

పెళ్లకూరు, నవంబరు 29: మండలంలోని కొత్తూరు గిరిజన కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు హరికృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పౌర హక్కుల గురించి వివరించారు. అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంఈవో శంకరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ కుమార్, సీహెచ్‌వో వెంకటకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిప్రియ, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి శనివారం కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన ఎర్రమల చంద్రశేఖర్ రెడ్డి రూ.1,00,001 విరాళంగా అందజేశారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కామేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.


సహాయ కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

సంమృద్ధిగా వర్షాలు.. ఆశాజనకంగా రబీ సాగు



అక్కగారిపేట వద్ద పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు - జీలపాటూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

పెళ్లకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాధారణం కంటే అధికంగా కురుస్తున్న వర్షాలతో ఈ ఏడాది రబీసాగు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతల్లో ఆనందోత్సాహం నెలకొంది. గతంలో సరైన వర్షాలు లేక పోవడంతో సాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉండేది. గత ఏడాది మండలంలో వరిసాగు 11 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే రైతులు దాదాపు 12 వేల ఎకరాలకు పైగా వరిసాగు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు 8 వేల ఎకరాల్లో వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. రబీ సాగుకు అనుకూలంగా వర్షాలు కురవడంతో స్వర్ణముఖినది, మామిడి కాలువల్లో నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. చెరువులు, వాగులు, వంకలు నిండుకుండల్లా మారాయి. భూగర్భజలాలు భారీగా వృద్ధి చెంది బోరుబావుల్లో నీటి మట్టం పెరిగింది. రబీ సీజన్‌లో అధిక దిగుబడులు పొందుతామనే నమ్మకంతో రైతులు ఉన్నారు.

నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలి

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి విస్మరించడం తగదన్నారు. గూడూరు ప్రజల మనోభావాలకు అనుగుణంగా నెల్లూరు జిల్లాలో కలపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఖాదర్, మస్తాన్, నవీన్, వంశీ, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

యూరియా పంపిణీ


యూరియా పంపిణీ చేస్తున్న రామచంద్రయ్య నాయుడు

దక్కిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు శనివారం కమ్మపల్లిలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెప్పారు. యూరియా కొరత ఉందంటూ కొందరు వైసీపీ నేతలు పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోకూరు రమేష్ నాయుడు, పీపీ చౌదరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కురుగొండ ఉన్నత పాఠశాలలో 'బేటీ బచావో - బేటీ పఢావో'


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

ఓజిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో 'బేటీ బచావో - బేటీ పఢావో' కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్ వంటి అంశాలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రధానోపాధ్యాయుడు తీపలపూడి వెంకటేశ్వర్లు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరాజ, అంగన్వాడీ కార్యకర్తలు సుహాసిని, అనూషా, రాజేశ్వరి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పెంచలనాయుడు

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగం థియేటర్ సెంటర్‌లో శనివారం హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కంకణాల పెంచలనాయుడు మాట్లాడుతూ చలికాలంలో పేదలకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతో దుప్పట్లు అందజేశామన్నారు.

బాలిరెడ్డిపాళెంలో మహిళలకు...

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో ఉన్న పట్టాభిరామాలయంలో శనివారం పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టాభిరామాలయ వేదాంతి దివి అనంతాచార్యులు, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, షిరిడీసాయి అక్షయ సేవాసమితి సభ్యులు పన్నాగ సాయి, జంపలూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వెంకటగిరి, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసింహారావు వీధిలోని ఆటో కార్మికుడు తులసి నటరాజా అనారోగ్యంతో బాధపడుతుండటంతో శనివారం శ్రీకృష్ణ దేవరాయ కాపు, బలిజ సేవా సంఘం సభ్యులు రూ.11వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు గుండు మనోజ్ కుమార్, పకీర్‌గారి గోపాల్, అడపాల రాము, బొక్కిసం రమేష్, వంగవీటి మధు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో...

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడకు చెందిన రమణయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల కోసం టీడీపీ సీనియర్ నాయ కుడు తానంకి నానాజీ సహకారంతో మాజీ సర్పంచు రామ్మూర్తి, టీడీపీ నాయకులు రవి, చిన్నయ్య, వెంకటరాగయ్య మూడు వేల రూపాయలు రమణయ్య కుటుంబసభ్యులకు అందజేశారు.

దాడి ఘటనలో ఆరుగురి అరెస్టు

తడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో ఆరుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని గ్రద్ధగుంటకు చెందిన ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేటకు చెందిన కౌన్సిలర్ శరత్ గౌడ్‌కు మధ్య వ్యాపార లావాదేవీల విషయమై విభేదాలు ఉన్నాయి. గురువారం రాత్రి శరత్ గౌడ్ స్నేహితులతో కలిసి గ్రద్ధగుంటలో ప్రవీణ్ కుమార్ ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ అతను లేకపోయే సరికి వాచ్‌మెన్ వెంకయ్యపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శరత్ గౌడ్, అతని స్నేహితులైన దిలీప్, వెంకటరమణ, ప్రేమ్‌కుమార్, మురళితో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివశంకర్

దక్కిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. మండలంలోని శ్రీపురం దళితవాడలో శనివారం సివిల్స్ రైట్స్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కక్షలు విడనాడి, వివాదాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం సాగించాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రపన్నరాణి మాట్లాడుతూ రెవెన్యూ సేవలు ఏ విధంగా పొందాలో వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పెంచలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం

వెంకటగిరి, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన శనివారం స్వల్ప వివాదాల నడుమ ప్రశాంతంగా జరిగింది. సమావేశం ప్రారంభంలోనే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ 4వ వార్డు కౌన్సిలర్ ప్లకార్డులతో నిరసన తెలిపారు. వార్డుల్లో సమస్యలను పరిష్కరించడంలేదని విమర్శలు గుప్పించారు.

అన్నదానం

నాయుడుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు అన్నమనేని నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు అన్నమనేని సాయి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు మురళీధర్, శ్రీను, సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, జీవీఆర్ నాయుడు, మస్తాన్, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని చెందోడులో శనివారం ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో రక్తదాన శిబిరం జరి గింది. పలువురు యువకులు రక్తదానం చేశారు. గూడూరుకు చెందిన మేడీపల్స్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, శివకుమార్ చేతుల మీదుగా ప్రసంశాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ ప్రతి నిధులు లీలామోహన్‌కృష్ణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డీలర్లు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ అన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతినెలా 1నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. తక్కువ తూకాలతో పేదలను మోసం చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అఖిల్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

వాకాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు వెలుగు వీవోఏలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు వీవోఏలతో టీమ్-5 సమీక్షా సమావేశం చేపట్టారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారి శుధ్యం, డ్రైనేజీ, వ్యవస్థ నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నాయుడుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బస్సులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ హెచ్చరించారు. శనివారం నాయుడుపేట - శ్రీకాళహస్తి జాతీయ రహదారి కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలకు చెందిన బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తుండడం, అత్యవసర ద్వారాలు తెరుచుకోకపోవడం, అగ్నిమాపక పరికరాలు పనిచేయకపోవడం గుర్తించారు. రికార్డులు సైతం సక్రమంగా లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు అనిల్‌కుమార్ తెలిపారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు సూళ్లూరుపేట ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఆర్డీవో కిరణ్మయి సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దన్నారు. నదిపరివాహక ప్రాంతాల వైపు రైతులు, ప్రజలు వెళ్లవద్దన్నారు. తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఏ అవసరమొచ్చినా ఫోన్ చేయవచ్చునన్నారు. తీరప్రాంత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని వట్రపాలెం వాసులను అవసరమైతే పునరావాస కేంద్రానికి తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

తడ: దిత్వా తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచించారు. నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు. తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, సచివాలయాల పరిధిలో ఐదుగురు అధికారులను నియమించామని, వారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని, వీరితో పాటు ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సూళ్లూరుపేటలో అందుబాటులో ఉంటుందని ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు.

వెంకటగిరి: దిత్వా తుఫాన్ కారణంగా గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల క్లస్టర్, యూనిట్, బూత్, వార్డు, గ్రామ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అదేవిధంగా అధికారులకు ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియ పరుస్తూ సహకరించాలని సూచించారు.

చిల్లకూరు: తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వెంకటగిరి టౌన్: దిత్వా తుఫాన్‌గా బలపడడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు నరసింహారావు, సీఐ రమణ కోరారు. మూడు రోజులు పాటు తుఫాను తీవ్ర ప్రభావం చూపించనుందని లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని కోరారు.

ఏకగ్రీవంగా బీటీఏ కమిటీ ఎన్నిక


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీటీఏ సభ్యులు

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో శనివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. కోట మండల బీటీఏ గౌరవ అధ్యక్షుడుగా మట్టిగుంట ప్రభాకర్, గౌరవ సలహాదారుడుగా గిరిప్రసాద్, అధ్యక్షుడుగా డేగా సుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షుడుగా తిరుమల శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుడంగుంట రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా పేర్నాటి నాగరాజు, అదనపు కార్యదర్శిగా ముప్పాల జనార్దన్, ఆర్థిక కార్యదర్శిగా ఏకుల నాగరాజు, ఆడిట్ కార్యదర్శిగా మల్లాపు వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శులుగా కల్లు సంపూర్ణమ్మ, ఎం. సులోచనారాణి, ఏలూరు శ్రీలతతో పాటు జిల్లా కార్యదర్శులుగా వెంకటకృష్ణయ్య, మట్టిగుంట శ్రీనివాసులు, పేర్నేటి రమణయ్య, వాటంబేటి సుబ్బారావు, కాకుమూరి సునీల్‌కుమార్, పురిణి హరినాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త కమిటీ చేత బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.చక్రవర్తి ప్రమాణం చేయించారు.

లారీని ఢీకొన్న కారు

ఐదుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన పద్మావతి, శ్రీనివాసరావు

నాయుడుపేట టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో లారీ కారును ఢీకొన్న సంఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు ప్రాంతానికి చెందిన అయ్యప్పస్వామి భక్తులు కారులో శబరిమలై వెళ్లారు. స్వామివారి దర్శనానంతరం స్వస్థలానికి వెళ్తుండగా ఆదివారం అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మావతి, శ్రీనివాసరావు, భరత్, మణికంఠ, సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో వాలీబాల్ జట్ల ఎంపిక

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలో జరిగే వాలీబాల్ పోటీలకు సంబంధించి జట్లను ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో 150 మంది, మహిళల విభాగంలో 50 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. పరిశీలకుడుగా డాక్టర్ నారాయణరెడ్డి వ్యవహరించారు. డిసెంబరులో కాకినాడ జేఎన్‌టీయూలో వాలీబాల్ పురుషుల టోర్నమెంట్, చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో మహిళల టోర్నమెంట్ జరుగనున్నాయి. కార్యక్రమంలో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ క్రీడాకారులతో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు

ముక్కంటి సేవలో ప్రముఖులు




ఆలయం వద్ద రాష్ట్ర జంగము కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్, నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ అయ్యప్ప

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర జంగము కార్పొరేషన్ చైర్మన్ వి.చంద్రశేఖర్, నటుడు, డబ్బిగ్ ఆర్టిస్ట్ అయ్యప్ప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా అయ్యప్ప ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న అఖండ-2లో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు, సుబ్రహ్మణ్యం, లోకేష్, శ్రీలక్ష్మి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ సురేష్‌రాజు

పిచ్చాటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కష్టపడిన కార్యకర్తలకే పదవులు వరిస్తాయని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చమర్తి సురేష్‌రాజు తెలిపారు. మండలంలోని కీళపూడిలో టీడీపీ నాయకుడు పద్మనాభరాజు స్వగృహంలో జరిగిన పార్టీ సమావేశంలో సురేష్ మాట్లాడుతూ... అధిష్ఠానం ఆదేశాల మేరకు గ్రామాల్లోకి వెళ్లి కమిటీలు ఏర్పాటు చేసిన అనంతరం మండల కమిటీలను నియమిస్తామని చెప్పారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు జెండా మోసి, అప్పగించిన పనులను చేయడమే కాకుండా బూత్ కమిటీల్లో పార్టీకి లభించిన మెజారిటీ ఆధారంగా పదవులు దక్కుతాయని చెప్పారు. వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎలక్షన్ అబ్జర్వర్లు రమణారెడ్డి, వెంకటేశ్వరులు, పళ్లికొండేశ్వర ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి



చాగంటి ప్రవచనాల్ని వింటున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలు లేని విద్యవల్ల ఉపయోగం ఉండదని, జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత పిల్లలను ప్రేమించే వారు గురువులేనని హెచ్‌ఎం వాణి అన్నారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో విలువలు- విద్యపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ గురు వులను అపహాస్యం చేయడం, విమర్శించడం తగదన్నారు. గొప్పవారి జీవిత చరిత్రలను విద్యార్థులు చదవాలని సూచించారు. ఇక ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర రావు ప్రసంగాన్ని విద్యార్థులకు వినిపించారు. పలు గ్రంథాల్లో రాసిన విలువలను నేర్చుకుంటే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతామని, విద్యార్థులకు స్వీయ నియంత్రణ అవరమని, అవసరంలేని విషయాల జోలికి వెళ్లకూడదని చాగంటి సూచించారు.

శ్రీకాళహస్తిలో ముసురు



శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం ముసురువాన కురిసింది. దిత్వా తుఫాన్ ప్రభావంతో శనివారం మధ్యాహ్నం 1.40గంటల నుంచి శ్రీకాళహస్తిలో వర్షపు జల్లులు ఆరంభమయ్యాయి. రాత్రి వరకు అడపా దడపా జల్లులు కురిశాయి. వాతావరణం ప్రభావంతో పట్టణంలోని రద్దీగా ఉన్న ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వీధి వ్యాపారాలు మందగించాయి.

డివిజన్ స్థాయి పోటీలకు ఉపాధ్యాయుల ఎంపిక



నారాయణవనంలో క్రికెట్ ఎంపికలు

ఏర్పేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం పురుష ఉపాధ్యా యులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఏర్పేడు మండల స్థాయిలో నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని డివిజన్ స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈవోలు ప్రేమలత, దయాకర్ తెలిపారు. నిత్యం విద్యా బోధనలో ఉండే ఉపాధ్యాయులకు ఈ క్రీడా పోటీలు నూతన ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇస్తా యన్నారు. పల్లం, బండారుపల్లి ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం ఆనంద్, రాజువేలు, సహ పీఈటీలు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. శనివారం స్థానిక బాలుర, బాలికల క్రీడా మైదానంలో ఎంఈవో రవి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ప్రతిభ ఆధారంగా ఎంపికైన వీరు డివిజన్ స్థాయి పోటీలకు హాజరవుతారని ఆయన తెలిపారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకే కాదు, ఉపాధ్యాయులకు కూడా క్రీడలు అవసరమేనని ఎంఈవో కోదండనాయుడు పేర్కొన్నారు. శనివారం నారాయణవనంలో మండల స్థాయిలో పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ , మహిళా ఉపాధ్యా యులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో2 జనార్దన్, పీఈటీలు రాజా, శివకుమార్, సదాశివన్, హరి, వెంకటేష్, జయప్రద, రుక్మిణి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీణ కచేరి



శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలోని కళావేదికలో శనివారం తిరుపతికి చెందిన శ్రీవాణి ఎల్లా వీణ కచేరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టూరిజం ఆర్డీలు వెంకటేశన్, రమణప్రసాద్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వ్యాపారంపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలకు వ్యాపారంపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. తిరుపతి టీటీడీసీలో శనివారం జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీఆర్పీల ద్వారా వ్యాపారం చేసే మహిళలకు ప్రభుత్వం అందించే రుణాలు, అందుకోసం దరఖాస్తు చేసుకునే విధానంపై అవ గాహన కల్పించాలన్నారు. రైతు ఉత్పాదక సంఘాలు ఆధునిక వ్యవసాయం చేసే విధంగా మహిళా సంఘాలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ ప్రభావతి, ఐబీడీపీఎం వెంకటేష్, ఏపీఎంలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్పీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు ఎయిడ్స్ వలన కలిగే అనర్థాలను వివరించారు.

రైతులకు పెద్దపీట: ఎమ్మెల్యే సుధీర్



మల్లవరంలో రైతన్నా మీకోసంలో ఎమ్మెల్యే సుధీర్ తదితరులు

రేణిగుంట, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శనివారం మధ్యాహ్నం మండలంలోని ఆర్‌మల్లవరంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా అనేక కార్యక్రమాలను చేపడతున్నట్టు తెలిపారు. మండలంలోని రైతుల ఖాతాలోకి ఇప్పటికే రూ. 4.54 కోట్లు జమ అయిందన్నారు. అలాగే మండలంలో 5,768 యూరియా బ్యాగులను అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టీడీపీ నాయకులుముని చంద్రారెడ్డి, మెహబూబ్ బాషా, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ తేజవతి, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిస్వామి నాయుడు, మండల వ్యవసాయ శాఖ అధికారి సునీల్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం



తవ్వకాలను అడ్డుకుంటున్న పోలీసులు




పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాలపై ఎమ్మెల్యే సుధీర్ సీరియస్‌గా స్పందించి అధికారులతో అడ్డుకట్ట వేయించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎదురుగా సన్నిధివీధికి ఆనుకుని ఉన్న స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగుతుండటంపై స్థానికులు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆయన వెంటనే శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు హుటాహుటినా ముక్కంటి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నది వద్దకు చేరుకుని తవ్వకాలను అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్ సహా నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తుఫాన్ పట్ల జాగ్రత్తగా ఉండండి

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే సుధీర్ ఒక ప్రకటనలో కోరారు. తుఫాన్ ప్రభావం రాయలసీమ జిల్లాలపై తీవ్రంగా ఉంటుందని తెలిపారు. భారీ గాలులు, వర్షాలుకురిసే అవకాశం ఉందన్నారు. అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, పాత భవనాలు, పూరిగుడిసెల్లో ఉన్నవారిని అధికారులు ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. తుఫాన్ పరిస్థితులపై నిరంతరం అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సుధీర్ పేర్కొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

కేవీబీపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రోశయ్య తెలిపారు. శనివారం వీఆర్వోలతో ఆయన సమీక్షించారు. ప్రతి వీఆర్వో తమపరిధిలో ఉన్న గ్రామాల్లోనే ఉండాలని, ఎప్పటికపుడు తుఫాన్ ప్రభావిత విషయాలను కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌కు తెలపాలన్నారు.

సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జంగము కులస్థుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌ని కోరారు. శనివారం వారు ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. జంగము కార్పొరేషన్ చైర్మన్ వి.చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ బాబు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

సత్యవేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో డ్వాక్రా సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనంపై డ్వాక్రా సభ్యులకు, సంఘమిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛమైన వాయువు, వృక్షాలు, నిర్మలమైన నీటి వనరులు, సహజ ఖనిజాలు, మృత్తికలు, లవణాలతో నిండిన సారవంతమైన భూములు మానవ మనుగడకు అత్యంత ఉపయోగకరమైనవి అని తెలిపారు. ఇప్పటికే బృందావనం ఏర్పాటుచేసి గ్రామాల్లో రోజూ పోగవుతున్న చెత్తను సేకరించి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వాటి ద్వారా వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తున్న విషయాన్ని ఆయన వివరించారు. దీంతో పాటు మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం, ఈవోపీఆర్డీ ముని రవికుమార్, పలువురు సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత



వెలుగు కార్యాలయం వద్ద డ్వాక్రా సభ్యుల మానవహారం

సత్యవేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సభ్యుల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, అక్రమాలను అరికట్టడం కోసమే మన డబ్బులు-మన లెక్కలు యాప్‌ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ పేర్కొన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో యాప్‌పై శిక్షణ ఇచ్చారు. యాప్ ద్వారా మహిళలు తమ లావాదేవీలను సులభంగా చూసుకోవచ్చన్నారు. ఏదైనా వ్యత్యాసాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ ముని రవికుమార్, ఏఎస్‌వో త్రివిక్రమరావు, డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం దేవేరుల సహా స్వామివారి ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊయలపై అధిష్ఠింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్ బట్టాచార్యులు ఆధ్వర్యంలో ఊంజల సేవను నిర్వహించారు.

కరపత్రాల పంపిణీ

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు పంచాయతీ పెన్నలపాడులో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు మీకోసం రైతన్నా కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను నెరవేర్చి ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వరదరాజునాయుడు, చెంచయ్య, సుబ్రహ్మణ్యం ఆచారి, బాలరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అత్తూరులో రైతులకు అవగాహన సదస్సు

రేణిగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అత్తూరులో రాష్ట్రీయ సేవా సమితి, ఐపీఎల్ సంస్థ సహకారంతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశు పోషణపై ఆధారపడిన రైతులకు అధిక పాలు దిగుబడి వచ్చేలా ఉత్పత్తులను, తక్కువ ధరలో నాణ్యమైన దాణాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐపీఎల్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, రాస్ బాలాజీ బాల వికాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, రాస్ కె.వి.కె హెడ్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 29: గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని అరిగిలకండ్రిగ గిరిజన కాలనీలో పౌరహక్కులపై రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలు సమస్యలను గిరిజనులు అధికారులు దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, ఏపీఎం, మునెయ్య, ఏపీఎం దేవరి, వీఆర్వో ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ, గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వులనూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి దర్శనం కల్పించారు.